
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

నంద్యాల
జిల్లా వార్తలు 5
శుక్రవారం 15 నవంబరు 2024

జడ్పీకి రూ.రూ.27 కోట్లు విడుదల

కర్నూలు న్యూసిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌కు 2024-2025 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.27 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,33,72,556, టైడ్ గ్రాంట్ కింద రూ.8,00,59,140 మొత్తం రూ.13,34,43,696 విడుదల చేసిందన్నారు. దీంతో పాటు 53 మండల పరిషత్‌లకు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,42,88,238, టైడ్ గ్రాంట్ కింద రూ.8,14,32,319 కలిపి జడ్పీకి రూ.27 కోట్లు విడుదల అయ్యాయని అన్నారు.


జీఆర్పీ బసలదొడ్డి స్టేజ్-2 ఎత్తిపోతల పథకం

రాఘువేంద్రా.. గోడు వినవా..!

పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసలు నివారణే లక్ష్యంగా నిర్మించిన ప్రాజెక్టుల్లో గురురాఘవేంద్ర ఒకటి. బడ్జెట్‌లో రూ.69.04 కోట్లు ఇస్తే శాశ్వత మరమ్మతులు చేస్తారని రైతులు సంతోషించారు. అందులో రూ.63 కోట్లు విద్యుత్ బిల్లులకే కేటాయించారు. దీంతో మరమ్మతులు, నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనుల బకాయిలు రూ.35 కోట్లు ఉంటే ఇచ్చింది రూ.11.79 కోట్లు మాత్రమే. వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ భూ సేకరణ ఊసే లేదు. హంద్రీనీవా పందికోన జలాశయం కుడి, ఎడమ కాలువ అసంపూర్తి పనులకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నారు. జిల్లా ప్రాజెక్టులకు కరువు తీరా నిధులు వస్తాయనుకుంటే అరకొర నిధులతో సరిపుచ్చారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.69 కోట్లు.. విద్యుత్ బిల్లులకే రూ.63 కోట్లు
- జీడీపీకి రూ.11.79 కోట్లు కేటాయింపు.. బకాయిలే రూ.35 కోట్లు..
- వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుల భూసేకరణ ఇక లేనట్లే
- ఎన్నికల ప్రచారంగా మాత్రమే గుండ్రేవుల ప్రాజెక్టు
- హంద్రీనీవా పందికోన జలాశయం కుడి, ఎడమ కాలువలు పూర్తయ్యేనా?


గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల దుస్థితి ఇలా



కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత కర్నూలు జిల్లాలో గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన పత్తికొండ (పందికోన) జలాశయం, ఎల్లెల్సీ కాలువలు ఉన్నా యి. గాజులదిన్నె జలాశయంలో 4.5 టీఎంసీలు మాత్రమే నిల్వ చేసుకునే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టులు వైసీపీ ప్రభుత్వ హాయాంలో నిర్లక్ష్యానికి గురై అటకెక్కాయి. గుండ్రేవుల జలాశ యం అంతర్రాష్ట్ర సమస్య అంటూ పెండింగ్ ఫైళ్ల కిందకు తోసేశారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చింది. ఏకంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా బాధ్య తలు చేపట్టారు. కరువు తీరా నిధులు వస్తాయని, సాగునీటి ప్రాజెక్టులు పట్టాలెక్కి మెట్ట చేలకు తుంగ భద్ర జలాలు అందుతాయని రైతులు ఆశించారు. అయితే చివరకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పూర్తిస్థాయి తొలి బడ్జెట్‌లో అరకొర నిధులతో సరిపుచ్చారు. అందులోనూ ముప్పాతిక శాతం నిధులు కరెంటు బిల్లులు, బాకాయిలకే సరిపోవ డంతో ఉన్న ప్రాజెక్టుల మరమ్మతులు, భూ సేకరణ, పనులు పునఃప్రారంభం ప్రశ్నార్థకంగా మారింది.

కర్నూలు జిల్లా మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో రైతులు జలజీవనాడి గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టులు. తుంగభద్ర నది నుంచి 3.786 టీఎంసీల నీటిని ఎత్తిపోసి ఎల్లెల్సీ చివరి ఆయకట్టు 45,790 ఎకరాలకు సాగునీరు అందించాలని 2003లో ఆనాటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి పట్టుబట్టడంతో అదే ఏడాది ఆగస్టు 22న రూ.177 కోట్లు నిధులు చేస్తూ అప్పటి సీఎం చంద్రబాబు జీవో ఎంఎస్ నం.132 జారీ చేశారు. కోసిగి, వంత్రాలయం, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, కల్లూరు మండలాలలో ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో గురు రాఘవేంద్ర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు.

మిగతా 6లో...


పనులు ఆపేయడంతో ఎక్కడికక్కడ వేదవతి ప్రాజెక్టు పైపులు

సహకార సంఘాల బలోపేతానికి కృషి : కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు బలోపేతం చేయడానికి కృషి చెయ్యాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని జెవిఆర్ నగర్ హౌస్ బిల్డింగ్ కో ఆపరేటివ్ సొసైటీ ఆవరణలో 71 వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాలు జరిగాయి. ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి అన్ని సంఘాల పాలక వర్గ సభ్యులతో పాటు సహకార శాఖ అధికారులు, బ్యాంక్ సిబ్బంది తమవంతు కృషి చెయ్యాలన్నారు. సహకార చట్టాలకు, నిబంధనలకు సంఘ సభ్యులు లోబడి పనిచేసి అభివృద్ధికి దోహదం చెయ్యాలన్నారు. అలాగే సహకార సంఘాలలోని లోటుపాట్లను గుర్తించి ముందుకు తీసుకొని పోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా సహకార బ్యాంక్ జనరల్ మేనేజర్ శివలీల, విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఊరికి మంచి పేరు తేవాలి

పాణ్యం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దనరెడ్డి కోరారు. దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా గురువారం బలపనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో డీఈఓ పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణ, ఎంఈఓ కోటయ్య, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నెహ్రూకు నివాళులర్పిస్తున్న డీఈఓ, ఉపాధ్యాయులు


నీటిలో దీపాలు వదులుతున్న మహిళలు

శ్రీశైలంలో కార్తీక పూజలు


పూజలందుకుంటున్న దత్తాత్రేయస్వామి




దీపాలు వెలిగిస్తున్న భక్తులు

● నేడు పుణ్యనదీ హారతి, జ్వాలాతోరణం, లక్ష దీపోత్సవం, దశవిధ హారతులు

శ్రీశైలం, నవంబరు 14(ఆంధ్రజోతి): శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేకకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఆలయ ఉత్తర మాఢవీధి ప్రాంగణం వద్ద, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద పెద్ద ఎత్తున దీపారాధనలను చేశారు. అదేవిధంగా కొంతమంది భక్తులు లక్ష వొత్తుల నోములను నోచుకున్నారు. సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం వెలిగించారు. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారం రోజులలో స్వామివారి అలంకరణ దర్శనానికి మాత్రమే అవకాశం కల్పించనున్నారు. శ్రీశైలం క్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం వద్ద దత్తాత్రేయ స్వామివారికి విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది.

నేడు పుణ్యనదీ హారతి, జ్వాలాతోరణం

నేడు పౌర్ణమి ఘడియలు పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం పాతాళగంగలో పుణ్యనదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ముందు భాగంలో ఉన్న గంగాధర మండపం వద్ద సాయంత్రం జ్వాలాతోరణం, లక్ష దీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలను నిర్వహించనుంది.

కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లు గురవారం బాధ్యతలు చేపట్టారు. ఈ పదవి ఆయన రెండోసారి స్వీరించారు. కుడా వైస్ ఛైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టరు (జేసీ) బి. నవ్య.. సోమిశెట్టి చేత ప్రమాణస్వీకారం చేయించారు. టీజీవీ కంపెనీస్ ఛైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ప్రధాన కార్యదర్శి అకేపోగు ప్రభాకర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర నాగేశ్వరరావు యాదవ్ తదితరులు హాజరై శుభకాంక్షలు తెలియ జేశారు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం కుడా ఏర్పాటు చేసింది. తొలి ఛైర్మన్‌గా సోమిశెట్టి బాధ్యతలు చేపట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో పదవికి రాజీనామా చేశారు. 1982లో హైదరాబాద్ నిజాం మైదానంలో జరిగిన టీడీపీ ఆవిర్భావం సభలో పార్టీ వ్యవస్థాకుడు ఎన్టీఆర్ చేతులు మీదుగా సభ్యత్వం తీసుకున్న ముఖ్య నాయకుల్లో సోమిశెట్టి ఒకరు. దాదాపు 25 ఏళ్లు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి నిర్వహించారు. మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు రెండోసారి కుడా ఛైర్మన్ పదవి ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాలేదు. ఈ నెల 25న మంత్రులు, పార్టీ రాష్ట్రస్థాయి ముఖ్యనేతలు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో సన్మాన సభ ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టరు నంద్యాల నాగేంద్ర, టీడీపీ నాయకులు పేరపోగు రాజు, సోమిశెట్టి నవీన్, కిశోర్, ఎల్‌వీ ప్రసాద్, మహేశ్‌గౌడ్, పి.చిన్న మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

సోమిశెట్టి బాధ్యతల స్వీకరణ

కుడా ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయించిన జేసీ బి. నవ్య



ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

● ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖకుమార్

రుద్రవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టరు షణ్ముఖకుమార్ అన్నారు. గురువారం రుద్రవరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటి రూఫ్ వాటర్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 26 వేల సీసీ రోడ్లకు గానూ 2500 కి.మీ. నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. యాక్షన్ ప్లాన్ గ్రౌండ్ చేసి సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. మహానంది మండలంలోని బొల్లవరం, రుద్రవరంలో పర్యటించి పనులు పరిశీలించామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15వేల పనులు గ్రౌండ్ లెవెల్‌లో ఉన్నాయని, 3వేలకు పైగా సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. రుద్రవరం, మహానంది మండలాల్లో రైతులకు ఫారం పాండ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీడీ జనార్ధనరావు, ఏపీడీ సాంబశివరావు, ఏవో సుబ్రమణ్యం, పంచాయతీరాజ్ ఈఈ కమాల్ సాహెబ్, ఏపీవో ప్రసాద్, పీసీ సుబ్బన్న పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న షణ్ముఖకుమార్

రూ. 20 కోట్లు ఆశ చూపి..

- జీఎస్‌టీ రూ.15 లక్షలు చెల్లించాలని మోసం
- నలుగురు నిందితుల అరెస్టు

7 లో

నల్లమల... భక్తులతో కళకళ

- ప్రకృతి రమణీయత మధ్య ప్రాచీన పుణ్యక్షేత్రాలు
- జాగరణకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయాల నిర్వాహకులు

7 లో

నాడు పీఎస్ నేడు ఐఏఎస్

స్ఫూర్తిదాయకం ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి ప్రస్థానం

6



ఆలయాల నల్లమల

- ప్రకృతి రమణీయత మధ్య ప్రాచీన పుణ్యక్షేత్రాలు
- జాగరణకు ఏర్పాట్లు చేస్తున్న ఆలయాల నిర్వాహకులు

నల్లమల అడవులు ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు నెలవు. శ్రీశైలం, మహానంది, యాగంటి, సంగమేశ్వరం, ఓంకారం, కొలనుభారతి వంటి ఆలయాలు నల్లమలలో ఒడిలో ఒదిగి ఉన్నాయి. మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం కావడంతో ఈ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. కార్తీక సోమవారాలు, సెలవు రోజుల్లో ఆయా క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రత్యేకించి కార్తీక పౌర్ణమి రోజున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తజనులు పోటెత్తనున్నారు. నవంబరు 1వ తేదీన కార్తీక మాసం మొదలై డిసెంబరు 1కి పూర్తి కానుంది. ఇందులో నవంబరు 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు పౌర్ణమి శోభను సంతరించుకోనున్నాయి. ప్రత్యేకించి ఈ శైవ క్షేత్రాలకు కార్తీక పౌర్ణమి రోజున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా వుంటే కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పలు శైవక్షేత్రాలకు ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. అయితే రుద్రకోడూరు, నాగలూటి, చిన్నగుమ్మితం, పెద్దగుమ్మితం క్షేత్రాలకు ప్రైవేట్ వాహనాల్లో అటవీ అధికారుల అనుమతుల మేరకు వెళ్లాల్సి ఉంది.

-ఆత్మకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)



శ్రీశైల మహాక్షేత్రం : ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనార్థం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని క్షేత్రంలో లక్ష దీపోత్సవం, పుష్కరిణికి నవవిధ హారతులు, జ్వాలాతోరణం వంటి క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఇప్పటికే దేవస్థానం అధికారులకు భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లు, ప్రత్యేక లడ్డూ కౌంటర్లు, అన్నదానం తదితర వసతులను ఏర్పాటు చేస్తున్నారు.



మహానంది క్షేత్రం : నల్లమల ప్రకృతి అందాల నడుమ వెలసిన మహానంది క్షేత్రాన్ని నందన చక్రవర్తి కాలంలో నిర్మించినట్లు ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది. అత్యంత ప్రాచీన ఈ క్షేత్రంలో కామేశ్వరీ సహిత మహానందీశ్వరుడి దర్శనార్థం కార్తీక మాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. క్షేత్ర పరిధిలోని రుద్రగుండ కోనేరులో, ఆలయ వెలుపల ఉన్న చిన్నపాటి రెండు కోనేరుల్లో భక్తులు కార్తీక పుణ్య స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున ఇక్కడ దీపోత్సవం నిర్వహిస్తారు.



సంగమేశ్వర క్షేత్రం: కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమ క్షేత్రంలో సంగమేశ్వరాలయం నదీజలాల్లో నీటమునగడంతో ప్రస్తుతం ఎగువ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను జరపనున్నారు. క్షేత్రంలో ఎగువ పుష్కర ఘాట్ వరకు నదీ జలాలు ఉండటంతో భక్తులు సప్తనదీ జలాల్లో పుణ్య స్నానాలు ఆచరించి దీపాలను వెలిగించనున్నారు. దీంతో కార్తీక పౌర్ణమి రోజుకే క్షేత్రంలో వేపదారు శివలింగం దర్శనభాగ్యం భక్తులకు కలగనుంది. అలాగే ఎగువ ఉమామహేశ్వరాలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించవచ్చు.



కొలనుభారతి క్షేత్రం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్షేత్రంలో అమ్మవారు నాలుగు చేతులు కలిగి ఉత్తర ముఖంగా దర్శనభాగ్యం కల్పించి కుడి రెండు చేతుల్లో పాశం, అభయహస్తాన్ని కలిగి ఉంటుంది. అదేవిధంగా ఎడమవైపు రెండు చేతుల్లో పుస్తకం, అంకుశం(గొడ్డలి) కలిగి భక్తులకు దర్శనమిస్తారు. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో ప్రస్తుత నవ్యాంధ్రలో ఏకైక సరస్వతి ఆలయంగా కొలను భారతి క్షేత్రం విరాజిల్లుతోంది. కాగా క్షేత్రానికి వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనతో పాటు తమ చిన్నారులకు బీజాక్షర క్రతువులు, అక్షరాభ్యాసం చేయించేందుకు చర్యలు చేపట్టారు.

నాగలూటి వీరభద్రాలయం : బైర్లూటి నుంచి 8 కి.మీ దూరంలో ఉన్న నాగలూటిలో వెలసిన శ్రీశైల ద్వారపాలకుడు వీరభద్రస్వామి ఆలయం ఎంతో ప్రఖ్యాతి గాంచింది. శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వెళ్లే పాదయాత్రికులంతా స్వామివారిని దర్శించుకునే వెళ్లాల్సి ఉంది. ఈ క్షేత్రానికి కూడా కార్తీక మాసంలో భక్తులు వస్తుంటారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రానికి తరలివెళ్లే యాత్రికులు వీరభద్రుడ్ని దర్శించుకుని వెళ్తారు.





యాగంటి క్షేత్రం : ప్రసిద్ధి పుణ్యక్షేత్రాల్లో యాగంటి కూడా ఒకటి. ఈక్షేత్రంలోని ప్రధాన ఆలయంలో ఉమామహేశ్వర స్వామిఅమ్మవార్లు లింగంలో కొలువై ఉన్నారు. శివ పార్వతులు ఇద్దరూ లింగంలో దర్శనమివ్వడం ఇక్కడ విశేషం. ఈ క్షేత్రంలో యాగంటి బసవన్న స్వయంభువుగా వెలిసినట్లు చరిత్ర చెబుతోంది. ఈ నంది విగ్రహం రాను రాను పెరుగుతూ ఆలయ ప్రాంగణాన్ని ఆక్రమిస్తోంది. ఇక్కడ మరోవిశేషం ఏమిటంటే ఈ క్షేత్రంలో కాకులు కనిపించకపోవడం. ఈ క్షేత్రంలో ప్రకృతి ఒడిలో పట్టిన జలధార పర్వతసానువుల్లో ప్రవహించి కోనేరులోకి చేరుతుంది. ఈ కోనేరును అగస్త్య పుష్కరిణిగా పిలుస్తారు.



పెద్దగుమ్మితం: మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామానికి 6 కి.మీ దూరంలో గల ఎత్తైన నల్లమల కొండల్లో వెలసిన గుప్తమల్లికార్జున స్వామి క్షేత్రం ఎంతో ఖ్యాతి కెక్కింది. ఇక్కడ కొలువైన ముక్కంటేశ్వరుడిని, ధాన్య భ్రమరాంబ దేవిని భక్తితో కొలిస్తే కోరికలు సిద్ధిస్తాయన్నది భక్తుల విశ్వాసం. వడ్లరామాపురం, ఇందిరేశ్వరం చెంచు గూడేల నుంచి భక్తులు కాలినడకన అటవీమార్గం గుండా ఇక్కడికి చేరుకుంటారు.

చిన్నగుమ్మితం: ఇందిరేశ్వరం చెంచు గూడెం నుంచి 3 కి.మీ దూరంలో ఉన్న నల్లమల అడవుల్లో ఈ క్షేత్రం వెలసింది. ఇక్కడ కొలువైన స్వామి అమ్మవార్లను మల్లికార్జున, భ్రమరాంబ దేవిగా పిలుస్తారు. ఈ ఆలయం ఎంతో పురాతన మైనదిగా, మహిమలు కలిగినదిగా భక్తుల నమ్మకం, ఈ క్షేత్రంలో కూడా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే భక్తుల కోసం ఆల య కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

రుద్రకోటేశ్వరాలయం : మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామం నుంచి 15 కి.మీ దూరంలో నల్లమల అరణ్యంలో వెలసింది. పూర్వం ఈ క్షేత్రంలో పరమేశ్వరుడు స్వయంభూ లింగరూపంలో వెలసినట్లు పురాణ ఇతిహాసాలు చెబుతున్నాయి. ఆలయానికి ఈశాన్యంలో ఓ కల్ప వృక్షం ఉంది. ఈ వృక్షాన్ని తాకితే అమృతం స్రవించడమే కాకుండా వృక్షాన్ని పూజిస్తే సంతాన ప్రాప్తి కల్గుతుందని భక్తుల విశ్వాసం. కార్తీక పౌర్ణమి సందర్భంగా క్షేత్రంలో దీపోత్సవాన్ని నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఓంకార క్షేత్రం : జిల్లాలోని బండిఆత్మకూరు మండలంలో వెలసిన ఓంకార క్షేత్రం కార్తీక మాస శోభ సంతరించుకుంది. చాళుక్యుల కాలంలో క్షేత్ర నిర్మాణం జరిగినట్లు ఇక్కడి పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని క్షేత్రంలో వెలసిన గంగా ఉమా సమేత సిద్ధేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు విశేషంగా తరలి వస్తుంటారు. అలాగే ఎగువ ఉన్న కొండపై కాశీవిశాలక్ష్మి అమ్మవారి ఆలయం, వేంకటేశ్వరుడిని సన్నిధితోపాటు పలువురి దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కాగా దిగువ క్షేత్రంలో ఉన్న కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఐదుగురి ఎంపిక

కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లను ఎంపిక చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఐదుగురికి అవకాశం లభించింది. వాల్మీకి/బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కర్నూలు నియోజకవర్గానికి చెందిన బోయ మురళి (బీజేపీ), బోయ సంజీవలక్ష్మి(టీడీపీ), తోళ్ల మంజునాథ్ (జనసేన), డోన్ నియోజకవర్గం నుంచి మాజీ జడ్పీటీసీ సభ్యుడు వలసల రామకృష్ణ (టీడీపీ)కి అవకాశం దక్కింది. మాదిగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కర్నూలుకు చెందిన టీడీపీ నాయకుడు డి.శ్రీనివాసులును ఎంపిక చేశారు.

వైసీపీ హయాంలోని అక్రమ లే అవుట్లపై విచారణ: సోమిశెట్టి



కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నాటి చైర్మన్ అండదండలతో అక్రమ లే-అవుట్లు వేసి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టినట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విచారణ చేసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం కుడా చైర్మన్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధినేత, సీఎం చంద్రబాబు ఈ పదవి ఇచ్చారని అన్నారు. అవినీతి అక్రమాలకు తావులేకుండా బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ లే-అవుట్లను ఉపేక్షించేది లేదన్నారు. గత చైర్మన్ అవినీతి అక్రమాలు వల్ల ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చారని, ఈ స్థితిలో మార్పు తీసుకొస్తానని అన్నారు.

రమణీయం.. రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకి సేవ

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకి సేవ రమణీయంగా నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో ఉంచి వైభవంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. కార్తీక శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని గురువారం మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు కార్తీక దండకా స్నానం ఆచరించారు. అనంతరం తడి దుస్తులతో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు గురువారం పోటెత్తారు. మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిర్సింది. ప్రత్యేక ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు.

మంత్రాలయంలో హుబ్లీ పీఠాధిపతి

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నాటకలోని హుబ్లీ ఆదిశంకరాచార్య అద్వైత మఠం పీఠాధిపతి శివానంద భారతి తీర్థులు గురువారం మంత్రాలయం వచ్చారు. స్వామిజీకి మఠం అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శివశంకర్ అమరన్న సతీ సమేతంగా గురువారం మంత్రాలయం వచ్చారు. మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. వీరి వెంట తహసీల్దార్ ఎస్ రవి, ఎస్ఐ పరమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.



స్వర్ణపల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

ఘనంగా బాలల దినోత్సవం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశ తొలి ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకొని కర్నూలు నగరంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్నికి చేసిన సేవలను కొని యాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.రాజకుమారి, ఉప విద్యాశాఖ అధికారి హనుమంతురావు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషాద్రి

నాడు పీఎస్ నేడు ఐఏఎస్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- చిన్న ఉద్యోగం నుంచి ఉన్నత స్థాయికి..
- యువతకు స్ఫూర్తిగా ఆ అధికారి ప్రస్థానం
- ఈ విజయం అమ్మానాన్నలకు అంకితం
- ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్న ఉద్యోగంలో అడుగుపెట్టిన ఆమె నేడు ఐఏఎస్‌గా ఎంపికై అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేటి యువతకు తన ప్రస్థానం స్ఫూర్తిదాయకమని చాటి చెబుతున్నారు. పంచాయతీరాజ్ సెక్రటరీ నుంచి గ్రూపు-1 ఆఫీసర్‌గా, ఆ తరువాత ఐఏఎస్‌గా ఎంపికైన ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణిని ఆంధ్రజ్యోతి పలకరించగా పలు విషయాలు వెల్లడించారు. 'అమ్మా నాన్నల ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, ఈ విజయం వారికి సొంతమని చెబుతున్నారు. యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చని సూచిస్తున్నారు.

విద్యాభ్యాసం..

● మాది శ్రీకాకుళం జిల్లాలోని ఒప్పంగి. వ్యవసా య కుటుంబం నుంచి వచ్చాను. నాన్న వ్యవసాయం తోపాటు కూలి పనులు చేసేవారు. అమ్మ గృహిణి. అమ్మా నాన్న ఏమీ చదువుకోలేదు. అయినప్పటికీ చదువు విలువ తెలుసుకుని మా అక్క చెల్లెలిని కూడా బాగా చదివించారు. మా మామయ్య ఇచ్చిన సలహాతో ఒక లక్ష్యం పెట్టుకున్నాను. ఆ లక్ష్యం ప్రకారమే సివిల్స్ లో 285 ర్యాంకు సాధించాను. ఒకటి నుంచి 10వ తరగతి వరకు శ్రీకాకుళం చదివాను. ఇంటర్మీడియట్ విశాఖపట్నంలో పూర్తి చేశాను. తర్వాత ఢిల్లీలోని శ్రీరామకళాశాలలో డిగ్రీ బీకాం పట్టా పొందాను.

పంచాయతీ సెక్రటరీ నుంచి..

● 2019 సంవత్సరంలో పంచాయతీ సెక్రటరీగా పని చేశాను. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి 2021లో గ్రూప్-1 పరీక్ష రాశాను. మొదటి సారే ఇందులో ఎంపికై విశాఖ ట్రెజరీలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా పని చేశాను. ఈ ఉద్యోగం చేస్తూనే సివిల్స్ రాశాను. తొలి దఫాలోనే 285వ ర్యాంకు సాధించాను. ప్రస్తుతం శిక్షణలో భాగంగా ట్రైనీ కలెక్టర్‌గా కర్నూలుకు వచ్చాను. ప్రతి శాఖపై పట్టు సాధిస్తున్నాను.

నిరంతరంగా కృషి చేయాలి

● ఎవరైనా ఉన్నత స్థానానికి వెళ్లాలంటే ఒక గొప్ప లక్ష్యం ఏర్పరుచుకోవాలి. ప్రతి దశలోనూ ఆటంకాలు ఎదురవుతాయి. వాటిని ఎదుర్కొని ముందుకు వెళ్లాలి. మధ్యలో ఎక్కడా లక్ష్యాన్ని మర్చిపోరాదు. లక్ష్యం సాధించే వరకు నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి. ప్రయత్నాలు చేసే కొద్ది విజయం సాధించగలుగుతారు. కొన్ని సందర్భాలలో విజయం సాధించలేకపోతున్నామని భయపడకూడదు. మంచి ప్రణాళిక ద్వారా ముందుకు వెళ్లాలి.

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నా..

● శిక్షణ నిమిత్తం ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలను సందర్శించాను అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నాను. ఉన్నతాధికారులు ఆ సమస్యలను ఎలా పరిష్కారం అనేది గ్రహిస్తున్నాను.

రాఘవేంద్రా... గోడు వినవా..!

(5వ పేజీ తరువాయి)

గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా మూగలదొడ్డి, పులచింత, చిలకలడోణ, సోగనూరు, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాలు, 2005 మార్చి 23న ప్యాకేజీ-97 కింది రూ.65.21 కోట్లతో మాధవరం, బసలదొడ్డి, దుద్ది ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు లిఫ్టుల నిర్వహణ కోసం గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఓ అండ్ ఎం గ్రాంట్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రూ.15 కోట్లు కావాలని ఇంజనీర్లు ప్రతిపాదన. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు.. మూగలదొడ్డి, మాధవరం స్టేజ్-1, స్టేజ్-2, బసలదొడ్డి స్టేజ్-1, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2, సోగనూరు స్టేజ్-1, పులచింత స్టేజ్-1, స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పంప్‌హౌస్‌లో దొంగలు పడి హెచ్‌టీ, ఎల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసి విలువైన కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. మరమ్మతులకు రూ.5.50 కోట్లు తక్షణమే ఇవ్వాలని ప్రతిపాదించారు. తాజాగా బడ్జెట్‌లో రూ.69 కోట్లు ఇచ్చారు. కష్టాలు తీరాయని ఆశిస్తే.. అందులో రూ.63 కోట్లు గత వైసీపీ ప్రభుత్వం పెట్టిపోయిన విద్యుత్ బకాయిలకు కేటాయించారు. మరో రూ.6 కోట్లు హెడ్ ఆఫ్ అకౌంట్ 351 మేజర్ పనులకే ఇచ్చారు. అంటే గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు మిగిలింది రూ.6 లక్షలే. మరమ్మతులు ఎలా చేయాలని ఇంజనీర్లు తలలు పట్టుకుంటున్నారు.

బకాయి రూ.35 కోట్లు.. ఇచ్చింది రూ.11.79 కోట్లు

గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం 4.500 టీఎంసీలు. కుడి, ఎడమ కాలువల ద్వారా గోనేగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ మండలాల పరిధిలోని 21 గ్రామాలకు 25,454 ఎకరాలు రబీ ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. జిల్లాల విభజన తర్వాత కర్నూలులో ఇదే అతిపెద్ద జలాశయంగా మిగిలింది. ఇక్కడి నుంచే డోన్, కృష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాలు ద్వారా డోన్ పట్టణం సహా వివిధ పల్లెలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణానికి కూడా నీటి సరఫరా కోసం పైపులైన్ పనులు చేపట్టారు. కర్నూలు నగరానికి దాహం తీర్చే జీవనాడిగా మారింది. సాగు, తాగునీటి అవసరాలు దృష్ట్యా గత వైసీపీ ప్రభుత్వం నీటి సామర్థ్యం 5.5 టీఎంసీల(అదనంగా ఒక టీఎంసీ)కు పెంచుతూ రూ.57 కోట్లతో పనులు చేపట్టారు. మరో రూ.12 కోట్లతో ఆరు కొత్త క్రస్ట్‌గేట్లు ఏర్పాటు పనులు చేపట్టారు. 75 శాతం పనులు పూర్తి అయ్యాయని ఇంజనీర్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు దాదాపు రూ.35 కోట్లు బకాయి పెడితే ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తి బకాయిలు చెల్లిస్తుందని ఆశిస్తే.. బడ్జెట్‌లో కేవలం రూ.11.79 కోట్లు కేటాయించారు. అందులోనే నిర్వహణ కూడా చేపట్టాలి. జీడీపీ అసంపూర్తి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



అసంపూర్తిగా గాజులదిన్నె ప్రాజెక్టు మట్టికట్ట ఎత్తు పనులు



పందికోన రిజర్వాయరు దుస్థితి ఇది

భూ సేకరణకు నిధులేవి..?

ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలని 2019 జనవరిలో రూ.1,942.38 కోట్లతో వేదవతి ప్రాజెక్టు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోనే 40 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా 2019 జనవరిలో జీవో ఆర్టీ నం.76 జారీ చేసి రూ.1,985.42 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ పనులు గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) హెడ్ ఆఫ్ అకౌంట్ కిందే ఈ పనులు చేపడుతున్నారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో కరువు రైతుల్లో ఆశలు చిగురించాయి. అయితే బడ్జెట్‌లో నిధులు ఎండమావులుగా మారాయి. ఎల్లెల్సీ వేదవతి, ఆర్డీఎస్ మూడు ప్రాజెక్టులకు ఇచ్చింది కేవలం రూ.13 కోట్లే. అందులో ఆర్డీఎస్ బకాయిలు దాదాపు రూ.10 కోట్లు ఉన్నాయని ఇంజనీర్లు అంటున్నారు. వేదవతి ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలంటే భూ సేకరణకు తక్షణం రూ.56 కోట్లు కావాలి. ఆర్డీఎస్‌కు కూడా దాదాపు రూ.55 కోట్లు కావాలి. అంటే వచ్చే 2025-26 బడ్జెట్‌పైనే ఆశలు పెట్టుకోవాలి. హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పత్తికొండ (పందికోన) రిజర్వాయర్, కుడి, ఎడమ కాలువల అసంపూర్తి పనులకు రూ.200 కోట్లు కావాలని ఇంజనీర్లు ప్రతిపాదించారు. బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు స్పందించి సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులపై ఒత్తిడి తీసుకొచ్చి అడిషనల్ గ్రాంట్ రూపంలో నిధులు రాబట్టాలని జిల్లా రైతాంగం కోరుతోంది.

ఇంటింటా క్యాన్సర్ స్క్రీనింగ్

ఈ. తాండ్రపాడులో ప్రారంభించిన డీఎంఅండ్‌హెచ్ఓ



క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ

కర్నూలు హాస్పటల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల వయసు పైబడిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే క్యాన్సర్ 3.0 స్క్రీనింగ్ పరీక్షలను డీఎంఅండ్‌హెచ్ఓ డా.ఎల్. భాస్కర్ ప్రారంభించారు. ఈ మేరకు కర్నూలు మండలంలోని ఈ. తాండ్రపాడు పీహెచ్‌సీలో డీఎంఅండ్‌హెచ్ఓ ఎన్‌సీడీ నోడల్ అధికారి హేమలతతో కలిసి స్క్రీనింగ్ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ హైపర్ టెన్షన్, డయాబెటిక్, సాధారణ క్యాన్సర్ గురించి రోగులకు అవగాహన కల్పించాలని అన్నారు. మహిళలు, గర్భిణుల స్క్రీనింగ్ వివరాల్లో గోప్యత కచ్చితంగా పాటించాలని సూచించారు. మధుమేహం, బీపీ, గుండె వ్యాధులు, పక్షపాతం, మూత్రపిండాల వ్యాధులు, ఊపిరితిత్తులు వ్యాధులతో బాధపడుతున్న వారిని సమీపంలోని పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్‌కు రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఈ. తాండ్రపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా. మంజూష, డా. జి. వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సినీనటుడు పోసానిపై పోలీసులకు ఫిర్యాదు



ఆలూరులో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసాని మురళీ కృష్ణపై కేసు నమోదు చేయాలని ఆలూరు మండల టీడీపీ కన్వీనర్ అశోక్ యాదవ్ కోరారు. గురువారం ఆలూరు పోలీసులకు పోసాని మురళీకృష్ణపై ఫిర్యాదు చేశారు. సమాజానికి సేవ చేస్తున్న టీటీడీ చైర్మన్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు.. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు రాము యాదవ్, వెంకటేష్, హోతురప్ప పాల్గొన్నారు.

త్రీటౌన్‌లో టీడీపీ నాయకుల ఫిర్యాదు

కర్నూలు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు, వైసీపీ నేత పోసాని క్రిష్ణమురళిపై ఫిర్యాదు చేశారు. గురువారం నగరంలోని త్రీ టౌన్ సీఐ శేషయ్యకు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ ప్రసాద్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, మైనార్టీ సెల్ నాయకులు ఎస్‌కే షేక్ బషీర్ అహ్మద్, జనసేన రాయలసీమ నాయకులు పవన్ కుమార్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆదోనిలో కేసు నమోదు

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పోసాని కృష్ణమురళిపై ఆదోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై జనసేన పట్టణ అధ్యక్షుడు రేణువర్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, అంతేకాకుండా, గతంలో హైదరాబాద్ జరిగిన ప్రెస్‌మీట్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశారు. జనసేన నాయకులు ఇచ్చిన ఫిర్యాదుతో పోసాని కృష్ణమురళిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

హైకోర్టు సీమవాసుల హక్కు

- **హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త తరలింపుతో సీమకు ద్రోహం**
- **రాయలసీమ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ వై. జయరాజు**



కర్నూలు లీగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు కర్నూలులో వెంటనే హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని, ఇది సీమవాసుల హక్కు అని రాయలసీమ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ వై. జయరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన జారీ చేస్తూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఒక తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఎన్నికల వాగ్దానంలో పేర్కొన్నారని, అధికారం చేపట్టి నెలలు గడుస్తున్నా ఇంకా కార్యరూపం దాల్చలేదని ఆయన విమర్శించారు. రాయలసీమకు హైకోర్టు తరలింపునకు బీజేపీ, జనసేన పార్టీలు సుముఖంగా ఉన్నా కూడా టీడీపీ మౌనంగా ఉండటం సీమవాసుల్లో ఆగ్రహం పెరిగిపోతోందని ఆయన తెలిపారు. మరోవైపు ఇదివరకే కర్నూలులో పనిచేస్తున్న మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తలను కూడా విజయవాడకు తరలించి రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తలను కర్నూలులోనే కొనసాగించాలని కోరారు.

పోక్సో కోర్టు పీపీగా వై. ప్రకాశ్ రెడ్డి

కర్నూలు పోక్సో కోర్టు పీపీగా న్యాయవాది వై. ప్రకాశ్‌రెడ్డిని నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆదేశాలు జారీ చేసింది. ఇంతవరకు ఈయన నిర్వహిస్తున్న నాలుగవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పీపీ బాధ్యతలతోపాటూ పోక్సో కోర్టు పీపీ బాధ్యతలను కూడా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు కొనసాగించాలని పేర్కొన్నారు.

వేదవతి, గుండ్రేవుల పూర్తి చేస్తాం

- **కరువు, వలసల నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **శాసన మండలిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు**



కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల జలాశయం నిర్మాణాలు పూర్తి చేస్తామని, పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసల నివారణకు టీడీపీ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం శాసన మండలిలో వివరించారు. జిల్లా ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ.. 2019 జనవరిలో గత టీడీపీ ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,942 కోట్లు నిధులు మంజూరు చేసిందని, పాలనాపరమరమైన అనుమతులు, టెండర్లు కూడా పూర్తి చేసి పనులు చేపట్టామని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019-24లో బడ్జెట్‌కు పాలనపరమైన అనుమతులు ఉన్నా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. 4,819 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంటే కేవలం 9 ఎకరాలే సేకరించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్ట్ ఏజెన్సీ మేఘా కంపెనీ పనులు ఆపేసిందని తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టిందని, భూ సేకరణకు రూ.384 కోట్లు, సివిల్ వర్క్స్, పైపులైన్లు, జలాశయాలు, గ్రావిటీ కెనాల్, పంప్‌హౌస్ నిర్మాణాలకు రూ.1,452 కోట్లు అవసరమని గుర్తించామని చెప్పారు. సుంకేసుల బ్యారేజీ ఎగువన తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల జలాశయం నిర్మాణం కోసం 2019 ఫిబ్రవరిలో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.2,890 కోట్లు కేటాయించి, డీపీఆర్ తయారు చేసిందన్నారు. ఈ జలాశయం నిర్మాణం చేయాలంటే ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 23 వేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. అంతర్ రాష్ట్ర ప్రాజెక్టు కావడంతో ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పంపామన్నారు.

డీసీఆర్‌బీ తనిఖీ

కర్నూలు క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని డీసీఆర్‌బీ కార్యాలయాన్ని ఎస్పీ బిందుమాధవ్ గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. డీసీఆర్‌బీలోని అన్ని విభాగాలకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించారు. రౌడీలు, కేడీలు, అనుమానితుల పేర్లు ఉన్న రిజిస్టర్లను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రసాద్, గుణశేఖర్, రామయ్య నాయుడు ఉన్నారు.



డీసీఆర్‌బీ తనిఖీ చేస్తున్న ఎస్పీ

బీపీఈడీ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. రెగ్యులర్ 85 మందికి 79, సప్లిమెంటరీకి 16 మంది పరీక్షలు రాయగా 15 మంది ఉత్తీర్ణత సాధించారని పరీక్షల విభాగం అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధిపై కేసు నమోదు



ఫిర్యాదు చేస్తున్న ఐ-టీడీపీ నాయకులు

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధిపై గురువారం ఆదోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతపురానికి చెందిన జింకల రామాంజినేయులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోపాటు, మంత్రి నారా లోకేశ్ మీద అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అలాగే అసభ్యకరమైన ఫొటోలు క్రియేట్ చేసి సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేశాడు. దీంతో అతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదోని ఐ-టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ఎస్.సజ్జాద్ హుస్సేన్‌తో పాటు ఐ-టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బీ అంజినమ్మలు త్రీటౌన్ సీఐ రామలింగమయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైసీపీ సోషల్ మీడియా ప్రతినిధి జింకల రామాంజినేయులుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రూ.20 కోట్లు ఇస్తామని మోసం

- **నలుగురు నిందితుల అరెస్టు**



అరెస్టు చూపిస్తున్న టూ టౌన్ సీఐ, ఎస్‌ఐలు

కర్నూలు క్రైం , నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఫండ్ నుంచి రూ.20 కోట్లు ఇస్తామని, అందుకు గాను జీఎస్‌టీ కింద రూ.15 లక్షలు చెల్లించాలని నమ్మించే ప్రయత్నం చేసిన ఓ ముఠాను టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. నిందితులు హరీష్, భానుప్రతాప్, ప్రతాపరెడ్డి, శ్రీధర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నాగరాజా రావు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా సిద్దవరం గ్రామానికి చెందిన సోమశేఖర్‌కు బెంగళూరుకు చెందిన హరీష్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనకు విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్ లాంటి పెద్ద కంపెనీలతో పరిచయాలు ఉన్నాయని నమ్మించాడు. ఏదైనా ఫ్యాక్టరీ, ట్రస్టు లాంటివి ఉంటే ఈ కంపెనీల నుంచి రూ.20 కోట్లు అప్పుగా ఇప్పిస్తానని, అందుకు గాను రూ.15 లక్షలు జీఎస్‌టీ కింద చెల్లించాల్సి ఉంటుందని నమ్మించాడు. ఇది నిజమని నమ్మిన సోమశేఖర్ తన మిత్రుడు బసవరాజుతో కలిసి హరీష్ డీల్‌కు సరేనన్నాడు. బుధవారం హర్ష అనే వ్యక్తి వీరికి ఫోన్ చేసి కర్నూలు రాజ్ విహార్ లాడ్జికి రావాలని, అక్కడ రూ.15 లక్షలు ఇస్తే వెంటనే రూ.20 కోట్లు మీ ఖాతాలో జమ చేస్తానని చెప్పాడు. సోమశేఖర్, బసవరాజు ఇద్దరూ కలిసి బుధవారం రాత్రి కర్నూలు రాజ్‌విహార్ లాడ్జికి వచ్చారు. అప్పటికే లాడ్జి గదిలో నిందితులు నలుగురు ఉన్నారు. వారి మాటలను బట్టి తమను మోసగిస్తున్నారని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు లాడ్జికి వచ్చేసరికి అప్పటికే ఇద్దరు నిందితులు తప్పించుకున్నారు. పోలీసులు అప్రమత్తమై పారిపోయిన ఇద్దరితోపాటు లాడ్జిలోని ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి మహీంద్రా కారు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

గ్రంథాలయాల పురోభివృద్ధికి సహకరిస్తా

ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రంథాలయాల పురోభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ నాగరాజు తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి, గ్రంథాలయ ఉద్యమానికి కృషిచేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా ఎందరో విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావచ్చని చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు కల్పించిన ఏర్పాట్లను ఆయన అభినందించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తే విద్యార్థుల్లో చైతన్యం పెరుగుతుందని అన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేసీ కల్కూర, కేజీ గంగాధర్‌రెడ్డి, ముచ్చుకోట చంద్రశేఖర్, కార్యదర్శి కె. ప్రకాశ్, ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చేనేత కార్మికుడు మృతి

ఎమ్మిగనూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు, వైడబ్ల్యూసీఎస్ సీనియర్ సభ్యుడు జక్కా వెంకట్రామప్ప (95) వయోభారంతో గురువారం వేకువ జామున మృతి చెందారు. వెంకట్రామప్ప 20 ఏళ్ల వయస్సు నుంచే నేత పని చేసేవారు. దివంగత పద్మశ్రీ మాచాని సోమప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత మాచాని శివణ్ణ కుటుంబానికి నమ్మిన వ్యక్తిగా మెలిగారు. ఆయన మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న పలువురు చేనేత కార్మికులు, సొసైటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



బాలగంగాధర్ రెడ్డి (ఫైల్)

ఓర్వకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై హుస్సేనాపురం బస్టాండు సమీపంలో గురువారం జరిగిన రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్సై సునీల్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని శకునాల గ్రామానికి చెందిన బాలగంగాధర్‌రెడ్డి(48) సొంత పని నిమిత్తం హుసేనాపురం వచ్చి బస్టాండు వద్ద రోడ్డు దాటుతుండగా నంద్యాల వైపు వెళుతున్న లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలగంగాధర్‌రెడ్డి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతుడు గ్రామంలో డిష్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మృతునికి భార్య విజయమ్మ, కుమారులు ప్రవీణ్, నవీన్ ఉన్నారు. పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. గ్రామంలో భక్తిభావం, మంచితనం, అందరితో కలుపుగోలుగా మెలిగే బాలగంగాధర్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేడీసీసీ బ్యాంక్ మాజీచైర్మన్ మల్లికార్జునరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు మౌళీశ్వరరెడ్డి, హరి, పుల్లయ్య, గ్రామస్తులు బాలగంగాధర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిడుగుపడి మహిళకు తీవ్ర గాయాలు

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద మండలం గజ్జెహళ్లి గ్రామంలో పిడుగుపడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గజ్జెహళ్లికి చెందిన అనసూయ పంట చేలో కలుపు తీస్తుండగా వర్షం పడింది. దీంతో ఆమె చెట్టు కిందకు వెళ్లింది. అదే సమయంలో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షంతో పాటు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో కూడిన పిడుగు పడింది. దీంతో అనసూయ తీవ్ర గాయాలతో కిందపడిపోయింది.. ఆమెను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న కారణంగా కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

హిందూపురం ఎమ్మెల్యేను కలిసిన తుగ్గలి నాగేంద్ర



తుగ్గలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర గురువారం అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలో హిందుపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసి పత్తికొండ ప్రాంత సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. అలాగే భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపామని చెప్పారు. తన సమస్యలను కూడా తెలిపామని, వాటన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో సర్పంచ్ అరెస్టు

ఇద్దరు కార్యకర్తలు కూడా..



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ

కోసిగి, నవంబరు (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని అత్యాచార యత్నం కేసులో వైసీపీ సర్పంచ్ బోయ ఉసేనితో పాటు వైసీపీ కార్యకర్తలు వినోద్, మజ్జిగ సూర్యనారాయణలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారని అన్నారు. మండలంలో ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండెపోటుతో మహిళా రైతు మృతి

కోసిగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో మహిళా రైతు దుద్ది లక్ష్మి (49) గురువారం మృతి చెందింది. ఛాతిలో మంటగా ఉండటంతో భర్త చిన్నారెడ్డి ఆమెను కోసిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

మూడు మద్యం దుకాణాల్లో చోరీ

రూ.5 లక్షలు, మద్యం ఎత్తుకెళ్లిన దొంగలు



మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఆదోని, కర్నూలు బైపాస్ రోడ్డులో ఉన్న మూడు మద్యం దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మద్యం దుకాణాల పై కప్పులను కత్తిరించి లోపలకు చొరబడ్డారు. అనంతరం దుకాణాల్లో ఉన్న డబ్బు, మద్యంను ఎత్తుకెళ్లారు. పట్టణంలోని ఎద్దుల మార్కెట్‌కు ఎదురుగా ఓ షెడ్డులో నిర్వహిస్తున్న మద్యం దుకాణం పైభాగంలో రేకులను కోసి దుకాణంలో ఉన్న రూ. 3.50 లక్షలు ఎత్తుకెళ్లారు. అలాగే ఆదోని రోడ్డు వెంకటాపురం అడ్డ రోడ్డు సమీపంలో ఉన్న మరో మద్యం దుకాణంలో సైతం రేకులను కత్తిరించి లోపలకు దిగి రూ. 1.80 లక్షలను దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే లక్ష్మణ్ సినిమా థియేటర్ సమీపంలో ఉన్న మరో మద్యం దుకాణంలో సైతం పైభాగంలో రేకులను కత్తిరించారు. ఇక్కడ మాత్రం కొంత మేర మద్యం ఎత్తుకెళ్లారు. ఇలా ఒకే రోజు మూడు మద్యం దుకాణాల్లో దొంగతనం జరగడంతో పట్టణంలో కలకలం రేగింది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ శ్రీనివాసులు సిబ్బందితో చోరీ జరిగిన మద్యం దుకాణాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'అనుమతులు లేకుండా మరబోటు తిప్పితే చర్యలు'

కొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం నుంచి సోమశిలకు అనుమతులు లేకుండా మరబోట్లు తిప్పితే చర్యలు తప్పవని కొత్తపల్లి ఎస్ఐ కేశవ బోటు నిర్వాహకులను హెచ్చరించారు. ఈ నెల 13న కృష్ణా నదిలో 4 కిలో మీటర్లకు రూ.300 వసూలు చేస్తున్నట్లు తెలిసి ఎస్ఐ కేశవ తమ సిబ్బందితో కలిసి సంగమేశ్వరం వెళ్లారు. నిర్వాహకులకు ఇష్టానుసారంగా మరబోట్లు తిప్పితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మతో మాట్లాడుతూ భక్తులు నది లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించాలని కోరారు.

కరివేనలో గుడిసె దగ్ధం


కాలిపోతున్న గుడిసె

ఆత్మకూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన జాన్ అనే వ్యక్తికి చెందిన గుడిసెలో అన్నమ్మ, శ్రీనివాసులు అనే దంపతులు బాడుగకు నివాసం ఉంటున్నారు. వారు ఉదయం కూలీ పనులకు వెళ్లిన సమయంలో ప్రమాద వశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన అగ్నిమాపక అధికారులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాగా అప్పటికే గుడిసె మంటల్లో కాలి పోయింది. సుమారు రూ.2 లక్షల మేర నష్టం సంభవించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న త్రిలింగేశ్వరరెడ్డి

నంద్యాల రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలంలోని అయ్యలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టీడీపీ నంద్యాల మండల ఉపాధ్యక్షుడు త్రిలింగేశ్వరరెడ్డి 25 జతల క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఎం అలివేలమ్మ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై పంపిణీ చేశారు.

ముస్తాక్ అహ్మద్‌కు అభినందనలు


ముస్తాక్ అమ్మద్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

కొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అహ్మద్‌కు రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడంతో ఆయన స్వగ్రామమైన ముసలిమడుగుకు చెందిన మైనారిటీ నాయకులు నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. నాయకులు షఫీవుల్లా ఖుద్దూస్, షఫీవుల్లా అబ్దుల్ ఖాదర్, చాంద్‌బాషా, మన్సూర్ బాషా, జహీర్ గఫూర్, రెహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: మైనార్టీల అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ముస్తాక్ అహమ్మద్ అన్నారు. గురువారం ఆయన చదువుకున్న వెలుగోడులోని అరబిక్ కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాల నిర్వాహకులు ముస్తాక్ అహమ్మద్‌ను సన్మానించారు. మదరసా ప్రిన్సిపాల్ మహెబూబ్ రెహమాన్ జవాత్ మౌలానా, జిక్రియా మౌలానా, రెహమాన్‌ఖాన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


గోస్పాడు: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి


జూపాడుబంగ్లా: ఆదర్శ పాఠశాలలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

గోస్పాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా జరిగాయి. గురువారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. పసురపాడు మజరా గ్రామం శ్రీరాంనగర్‌లో హెచ్ఎం విజయరావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

గడివేముల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులోని పలు, ప్రభుత్వ పాఠశాలల్లో నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రంథాలయంలో అధికారి మధు, ఎంఈవో మోహన్‌రెడ్డి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం




వెలుగోడులో నెహ్రూ చిత్రపటం వద్ద, వెలుగోడులో గాడిచెర్ల విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఆత్మకూరు గ్రంథాలయ అధికారి రాకేష్ అన్నారు. విద్యార్థులు గ్రంథాయాలను సద్వినియోగించుకోవాలని సూచిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

వెలుగోడు: గ్రంథాలయం ఆవరణలో గాడిచెర్ల హరి సర్వోత్తమరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయాధికారి సుమలత, టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, కలాం, హిదాయత్, ఖలీల్, రాము, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: ఎం.తిమ్మాపురంలో గ్రంథాలయ 57 వారోత్సవాలను గ్రంథాలయ అధికారి రవిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్ర పటానికి ఎంఈవో రామసుబ్బయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు.

పాణ్యం: మండలంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాణ్యం తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రంలో గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏహెచ్ ఏడీ కమలాకర్, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు రామానుజరెడ్డి, సీతారామరాజు, విజయలక్ష్మి, శేసయ్య, పాల్గొన్నారు.


పాములపాడులో..

గడివేముల: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి నివాళి అర్పించారు. గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో బాలల దినోత్సవాన్ని, జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని గ్రంథాలయ అధికారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే గ్రంథాలయ వారోత్సావాలను ప్రారంభించారు. ఏఎన్ఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

'వయోజనుల అక్షరాస్యతను పెంచుదాం'

నంద్యాల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వయోజనుల అక్షరాస్యతను పెంచుదామని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో వయోజన విద్యా ఉపసంచాలకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వయోజనులలో అక్షరాస్యతను పెంచడానికి అనుసరించాల్సిన విధి విధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎంపీడీవో సుగుణశ్రీ, ఎంఈవో-2 శివప్రసాద్, డీఆర్‌డీఏ ఉల్లాస్ యాంకర్స్ పుణ్యవతి, కృష్ణమూర్తి, ఏపీఎం గుర్రప్పడు, విద్యా వలంటీర్లు పాల్గొన్నారు.

మహానంది: సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసనంపై అవగాహన కల్పించాలని వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రతాప్ సూచించారు. బుక్కాపురం స్రవంతి మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం ఉల్లాస్ కార్యక్రమంపై పొదుపు మహిళా సంఘాల లీడర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెలుగు సిబ్బంది, వయోజన విద్య వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటింటా వైద్య పరీక్షలు

బండిఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం, బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటా వైద్య పరీక్షలు చేశారు. గురువారం డాక్టర్లు భావన, సవిత, కృష్ణమోహన్, దినేష్‌బాబు నేతృత్వంలో బండిఆత్మకూరు, కడమలకాల్వ గ్రామాల్లో ఇంటింటా రక్త, బీపీ, షుగర్, క్యాన్సర్ రోగాలకు ఇంటింటా పరీక్షలు చేశారు. ప్రతి రోజు ఐదు ఇళ్లలో పరీక్షలు చేస్తామని, అందరు ఆరోగ్యంగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్యులు తెలిపారు.

'ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేయడం తగదు'

ఆత్మకూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం ప్రైవేటీకరిస్తూ నిర్వీర్యం చేయడం తగదని ఎల్ఐసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ కార్యదర్శి తిరుపతయ్య, ఆత్మకూరు అధ్యక్ష కార్యదర్శులు విజయ్‌కుమార్, మనోజ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం కోరారు. గురువారం పట్టంలోని పాతబస్టాండ్‌లో హైదరాబాదు నుంచి విచ్చేసిన ఎల్ఐసీ కళాజాత బృందం ఆధ్వర్యంలో పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, ఏబీఎం విశ్వనాథ్, ఎంప్లాయిస్, డీవోల యూనియన్ నాయకులు, లియాఫీ నాయకులు, సీఐటీయూ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, ఆత్మకూరు, నందికొట్కూరుకు చెందిన ఏజెంట్లు పాల్గొన్నారు.

'విద్యుత్ భారం తగ్గించాలి'

ఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలపై ట్రూ ఆఫ్ చార్జీలపై పేరుతో విధించిన విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరాయించాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, నరసింహ నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చా లని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యా లయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజే శారు. ఆ పార్టీ నాయకులు రజాక్, రామ్‌నాయక్, సురేంద్ర, సుధాకర్, నాగేశ్వరరావు, దినేష్ తదితరులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్యతరగతి కుటుంబాలపై నిత్యవసర సరుకులు పెంచడం సిగ్గుచేటని సీపీఎం నాయకులు రాము, కర్ణ డిమాండు చేశారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ధర్నాలో భాగంగా జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు అందజేశారు.

'సమస్యలు పరిష్కరించాలి'


వెలుగోడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని 108 సిబ్బంది డిమాండ్ చేశారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌కు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డికి వేర్వేరుగా సమ్మె నోటీసు అందించారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 25 తర్వాత సమ్మెలోకి వెళ్తామని చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

నంద్యాల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని పురష్కరించుకుని పట్టణంలోని రావూస్ కళాశా లలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మధుసూదన్ రావు, హరినాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయబాబు, రావూస్ కళాశాల చైర్మన్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసుల అభివృద్ధే లక్ష్యంగా పీఎం జన్‌మన్'

ఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీశైలం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వెంకటశివప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు గ్రామంలోని సచివాలయంలో పీఎం జన్‌మన్ ప్రోగ్రామ్ అంశాలపై సమీక్షించారు. శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చ్యువల్ ప్రోగ్రామ్ ద్వారా పీఎం జన్‌మన్ లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన మెరుగైన ఫలితాల గురించి ప్రసంగించనున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లాకు సంబంధించి ఈ కార్యక్రమాన్ని ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు చెంచుగూడేంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాగా ఈ సభకు అన్ని గూడేల నుంచి గిరిజనులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు లేకుండా విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ కేజీనాయక్, డీటీడబ్ల్యూవో హుసేనయ్య ఉన్నారు.


మాట్లాడుతున్న శ్రీశైలం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వెంకటశివప్రసాద్

కొత్తపల్లి: కొత్తపల్లిలోని భ్రమరాంబ చెంచుగూడెం గిరిజన పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకటశివప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగ విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించగా కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ విషయంపై స్థానిక హెచ్ఎం పద్మలతను పీవో ప్రశ్నించగా 11 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని సమాధానం ఇవ్వగా గూడెం వాసుల్లో అవగాహన కల్పించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఆదేశించారు.

'గ్రామాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించాలి'

పాణ్యం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని ప్రధాన సమస్యలను గుర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్లా సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికపై గురువారం ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయసిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ ఆర్థర్ సైమన్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులు, మండల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో అమానుల్లా, ఉపాధ్యక్షుడు రాజు, ఈవోఆర్డీ నాగఅనసూయ, ఎంఈవో అబ్దుల్‌కరీం, సర్పంచ్‌లు పరదేశి ప్రమీల, ఈటె పజయ్య, రాజారెడ్డి, పుల్లయ్య, పాల్గొన్నారు.

వెలుగోడు: ఆయా గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పాటుపడాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయిలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, గ్రామైక్యసంఘం లీడర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోఆర్డీ మురారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలని ఎంపీడీవో కేవీ.సుబ్రమ్యం పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆయా గ్రామాలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు, విలేజ్ బుక్ కీపర్లకు గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈవోఆర్డీ బోయేజ్‌బాబు తదితరులు ఉన్నారు.

క్షతగాత్రులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి

బండిఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఓంకారం సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారికి టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం నంద్యాలలో చికిత్స పొందుతున్న ఎ.కోడూరుకు బోయ వెంకటేశ్వర్లు, చిన్న లింగన్నను స్థానిక టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి సూచన మేరకు క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదును ఆయన అందజేశారు. ప్రమాదంలో మృతి చెందిన చెన్నారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు స్టాలిన్‌రాజు, నరసింహా, వుల్లయ్య, జయరాముడు, వెంకటరమణ పాల్గొన్నారు.

కార్తీకమాసం ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈవో

శ్రీశైలం, నవంబరు 14(ఆంధ్రజోతి): శ్రీశైలంలో కార్తీమాసం ఏర్పాట్లను ఇన్‌చార్జి ఈవో ఇ. చంద్రశేఖరరెడ్డి గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయంలోని క్యూలైన్లు, లడ్డుప్రసాదాల తయారీ, ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం-పుష్కరిణిహారతి ఏర్పాట్లు, పాతాళగంగ వద్ద ఏర్పాట్ల, క్షేత్రపరిధిలోని పార్కింగ్ ప్రదేశాలు మొదలైనవాటిని పరిశీలించారు. ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ కార్తీకమాసంలో సోవారాలు, కార్తీక పౌర్ణమి రోజులలో స్వామి, అమ్మవార్లకు నిర్వహించే కైంకర్యాలు, పుష్కరిణికి హారతి, లక్ష దీపోత్సవం కార్యక్రమాలు పూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించాలని సంబంధిత విభాగానికి సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పుష్కరిణి వద్ద స్వామి, అమ్మవార్లకు పూజాధికాలు నిర్వహించే వేదికను విశాలంగా ఏర్పాటు చేయాలని, లైటింగ్, విద్యుత్ దీపాలంకణ, సుందరీకణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాతాళగంగలో అధిక సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల సదుపాయాలలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. అలాగే క్షేత్ర ప్రదేశాలన్నీ పరిశుభ్రంగా ఉండేందుకు తగు చర్యలు చేపట్టాలనిసంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాలలో తగినంత లైటింగ్, చూచిక బోర్డులు స్పష్టంగా ఉండేల చూడాలన్నారు. పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. నరసింహారెడి, ఎఈవో మల్లికార్జునరెడ్డి, జి. స్వాములు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్


షణ్ముఖ కుమార్‌కు మెమెంటో అందిస్తున్న మహానంది ఆలయ ఏఈవో

మహానంది, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో మహానందిలో గురువారం ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ కుమార్‌ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏఈవో మధు ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి వారి మెమెంటో అందజేశారు. అనంతరం మహానంది మండలంలోని అల్లీనగరం, యి. బొల్లవరం, ఎంసీ ఫారం, గాజులపల్లి ఆర్ఎస్‌లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మాణంలో ఉన్న సీసీ రహదార్లతో పాటు ఉపాధిహామీ పథకం ద్వారా చేసిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాడి రైతులకు పశువులు ఉన్న వాటిని బట్టి షెడ్ల నిర్మించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 22,500 గోకులం షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు ఆయన కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జనార్దన్‌రావు, పీఆర్ ఈఈ శ్రీనివాసులు,, ఏపీడీ బాలాజీ నాయక్, డీఎల్‌పీవో రాంబాబు, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, ఈవోఆర్డీ నాగేంద్రుడు, ఏపీవో మనోహర్, పంచాయతీ కార్యదర్శులు నాగ సంజీవరావు, కలువ భాస్కర్ పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: స్వర్ణ పంచాయతీలుగా చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఉపాధిహామీ పథకం సంచాలకుడు షణ్ముకకుమార్ అన్నారు. గురువారం జిల్లాలో పల్లె పండుగలో కార్యక్రమంలో గుర్తించి చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. నంద్యాల డ్వామా కార్యాలయంలో ఉపాధి హామీ, పంచాయతీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

'సహకారం అందించాలి'

నంద్యాల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్‌కు అన్ని విధాలుగా సహకారం అందించాలని పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం నంద్యాల డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ సుధాకర్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞాన సూర్యుడు, రామయ్య మాట్లాడుతూ ఇటీవల ఉమ్మడి జిల్లాలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా కోశాధికారి సుధాకర్, నంద్యాల డివిజన్ కార్యదర్శి నాగరాజు, కోశాదికారి సుందరరాజు తదితరులు ఉన్నారు.

డోన్

దోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా వలసల రామకృష్ణ



డోన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ నియమితుల య్యారు. డోన్ నియోజకవర్గం నుంచి వలసల రామకృష్ణకు అవకాశం కల్పించారు. డోన్ మండలంలోని వలసల గ్రామానికి చెందిన ఆయన గత 40ఏళ్లుగా రాజకీయాల్లో కీలకంగా ఉన్నారు. డోన్ ఎంపీపీగా, జట్పీటీసీగా ఆయన పనిచేశారు. రామక్రిష్ణ సతీమణి పద్మావతమ్మ బేతంచెర్ల జడ్పీటీసీగా పనిచేశారు. టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న రామక్రిష్ణ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఉన్నారు.

'కార్తీక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి'

చాగలమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ సూచించారు. మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలో భైరవగుండాల క్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఎస్ఐ రమేష్‌రెడ్డి, పోలీసులు ఉన్నారు.

'గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి'

చాగలమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ సూచించారు. చాగలమర్రిలోని కస్తూర్బా సమీపంలోని లే అవుట్‌లలో నిర్మించుకున్న పక్కా గృహాలను గురువారం పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ విజయ్‌బాబు, ఏఈ నరసింహరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఇంజనీరింగ్ సహాయకులు కోటి, దినేష్‌లు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

రుద్రవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కంబలూరు గ్రామంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సీడీపీవో తేజస్విని అన్నారు. గురువారం చిన్నకంబలూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

రుద్రవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గురువారం రుద్రవరం తహసీల్దారు మల్లికార్జునరావుకు 108 ఉద్యోగులు ప్రసాద్, శ్రీనివాసులు, శ్రీనివాసులు, సురేంద్ర వినతిపత్రాన్నందించారు.

దొర్నిపాడు: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 108 కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం 108 సిబ్బంది బాలయ్య, జీవన్, శేఖర్ తదితరులు ఇన్‌చార్జి ఎంపీడీవో సులోచన, డిప్యూటీ తహసీల్దార్ మాధవ్‌లకు వినతి పత్రం అందజేశారు.

అవుకు: ప్రభుత్వం 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఈఎంటీలు, పైలెట్లు డిమాండ్ చేశారు. గురువారం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ సువర్ణదేవికి, ఎంపీడీవో వెంగన్నకు వినతి పత్రం అందజేశారు.

నేషనల్ హైవే విస్తరణకు ప్రతిపాదనలు

కొలిమిగుండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ ఆదేశాలతో కొలిమిగుండ్లలో మిగిలి పోయిన జాతీయ రహదారి విస్తరణకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు గురువారం ఎన్‌హెచ్ ఏఈ మునిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణతో కలిసి పట్టణంలో విస్తరించాల్సిన రహదారిని పరిశీలించారు. స్థానిక గ్రంథాలయం నుండి ఎర్రవాగు బ్రిడ్జి వరకు 70 మీటర్లు, ఏపీజీబీ బ్యాంకు వద్ద నుండి ఉన్నత పాఠశాల వరకు 100 మీటర్లు హైవే రహదారి తక్షణ విస్తరణకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఏఈ మునిస్వామి తెలిపారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు



శాప్ చైర్మన్ రవినాయుడును కలిసిన టీడీపీ నాయకులు

ప్యాపిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడును గురువారం విజయవాడలోని తన చాంబర్‌లో టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్య క్షుడు తమ్మినేని రాజశేఖర్‌నాయుడు, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు బట్టా సత్యం, రవికుమార్ చైర్మన్‌ను కలసిన వారిలో ఉన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్యాపిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్ర ప్రభుత్వంచే అవార్డులు అందుకున్న తొగటి సురేసుబాబు, రాంప్రసాద్‌లను గురువారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు వెంకట్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర అవార్డు అందుకున్న ఇరువురు ఉపాధ్యాయులు మండలంలో పనిచేసిన సమయంలో విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరనాయక్, చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సభ్యత్వం తీసుకోవాలి'

బేతంచెర్ల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం పొంది ప్రమాద బీమా రూ. 5 లక్షలు పొందాలని టీడీపీ మండల సమన్వయ ఛైర్మన్ ఉన్నం చంద్రశేఖర్ అన్నారు. గురువారం కొలుములపల్లె గ్రామంలో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హుశేన్‌రెడ్డి, రమేష్‌స్వామి, తిమ్మయ్య, నాగరాజు, మద్దిలేటి, గోపాల్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

బనగానపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీసీ ఇందిరమ్మ పాల్గొని జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టంగుటూరు శ్రీనయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పర్వీన్‌బాను ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం గౌరీ శంకర్, పాఠశాల కమిటీ చైర్మన్ బొగ్గల మధు, టీడీపీ నాయకులు వల్లెపుశంకర్, చల్లా రమణ, బంకహుసేని తదితరులు పాల్గొన్నారు. పలుకూరు ప్రాథమిక పాఠశాలలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి ఆధ్వర్యంలో గురువారం హెచ్ఎం మల్లికార్జున సమక్షంలో నిర్వహించారు.

ప్యాపిలి: గ్రంథాలయం, వయోవృద్ధుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ మధుసూదన్, మత్తుబాబా సాహెబ్, శ్యాంసన్, తిరుపతయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ (రూరల్): పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యలయంలో నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. అధ్యక్షుడు భాను సింగ్, గాలయ్య, గోపాల్, దాసప్ప, మౌలాలి, రామసుబ్బారెడ్డి, తిమ్మయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

రుద్రవరం: నరసాపురం ఉన్నత పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ, ఎంఈవో లక్ష్మి, సబ్ జైలు ప్యానల్ న్యాయవాది షహీనాబేగం, సర్పంచ్ శాంతకుమారి, ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం అధ్యక్షుడు మహ్మద్‌హుసేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- రుద్రవరం ఆదర్శపాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

చాగలమర్రి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాకమిటీ అధ్యక్షుడు గౌస్‌మోద్దీన్, హెచ్ఎం శాస్త్రి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మడలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉయ్యాలవాడ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాలలో హెచ్‌యం షరీఫ్, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డిలు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉయ్యాలవాడ పాఠశాల హెచ్ఎం ఆదాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నెహ్రూ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ గ్లోబల్ హైస్కూల్‌లో కరస్పాండెంట్స్ ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శైలజ,



బనగానపల్లెలో నివాళి అర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ

మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పించారు.

శిరివెళ్ల: శిరివెళ్లలోని గ్రంథాలయంలో ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్, లైబ్రేరియన్ సుజాత, విశ్రాంత ఎంఈవో మహబూబ్ బాషా.. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళి అర్పించారు.

బేతంచెర్ల: సీతారామపురం జడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వజిదున్నీసా బేగం ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దొర్నిపాడు గ్రంధాలయంలో గ్రంథాలయ అధికారిణి అఖిలబేగం, ఎంఈవో రామచంద్రారెడ్డి, హెచ్ఎం శ్రీనివాసరావు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

'రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి'

కోవెలకుంట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో భూముల రీసర్వేను అధికారులు రెవెన్యూ సిబ్బంది పకడ్బందీగా నిర్వహించా లని డోన్ ఆర్డీవో నరసింహులు సూచించారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయాన్ని డోన్ ఆర్డీవో నరసింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. వీఆర్వో, వీఎస్ఏలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ త్వరలో జరిగే సాగునీటి సంఘం ఎన్నికల జాబితా తయారు చేశామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను పరిష్కరిం చాలన్నారు. అలాగే రీసర్వేలో వచ్చిన అర్జీలను కూడా పరిష్కరిం చాల న్నారు. తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంటు పుల్లయ్య వీఆర్వోలు నాగమద్దిలేటి, బాలమద్దిలేటి, పుల్లయ్య, లక్షుమయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

కోవెలకుంట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సాగునీటి సంఘం ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేవనూరు 35, 34, బీమునిపాడు, కంపమల్ల 41 సంబంధించి కేసీసీ పరిధిలో ఎన్నికలు జరగనున్నాయన్నారు. అలాగే సౌదరిదిన్నె, గుళ్లదుర్తి, పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు బిజినవేముల గ్రామాల పరిధిలో ఎస్ఆర్‌బీసీ, అలాగే పెద్దకొప్పెర్ల మైనరు ఇరిగేషను పరిధిలో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

చాగలమర్రి: మండలంలోని 11 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ గురువారం తెలిపారు. 3 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 2 కేసీ కెనాల్, 6 టీజీపీలకు, 105 టీసీలకు ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతు ఓటర్ల జాబితాను ఆయా గ్రామాల సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో ఉంచామని అన్నారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

కొలిమిగుండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామం టీడీపీ నాయకుడు తోట శివారెడ్డిని మండల టీడీపీ అధ్యక్షులు మూలే రామేశ్వరరెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో శివారెడ్డి గాయపడ్డారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని రామేశ్వరరెడ్డి ఆకాంక్షించారు.

కేబుల్ వైరు చోరీ

కొలిమిగుండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల లక్ష్మీనరసింహ స్వామి కొండ వెనుక వైపు ఉన్న పొలాల్లో కేబుల్ వైర్ చోరీకి గురైనట్లు బాధిత రైతులు బుధవారం వెల్లడించారు. గ్రామానికి చెందిన మద్దిలేటి, చలపతి, సుదర్శనరెడ్డి, రఘు తదితరులకు చెందిన 170మీటర్లు కేబుల్ వైర్ కట్‌చేసి ఎత్తు కెళ్లారు. సుమారు రూ.25వేలు విలువ చేసే కేబుల్ వైర్, కాపర్ వైర్ ఎత్తుకెళ్లారని రైతులు వాపోయారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

దొర్నిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభచూపి అండర్-17 విభాగంలో మహమ్మద్ అఫ్రిన్, అండర్-14లో సిద్ధికళ, ఖోఖో అండర్-14 విభాగంలో దేవిక, చపక్‌తక్ర అండర్-14 విభాగంలో అనూష, మాధవి ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే అనంతపురం, పల్నాడులో జరిగే క్రీడల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన పీడీ దేవేంద్రను ఉపాధ్యాయులు శాలువ కప్పి అభినందించారు.

'గ్రామాభివృద్ధి అందరి బాధ్యత'

దొర్నిపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేసేందుకు అందరూ బాధ్యతగా సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సులోచన అన్నారు. గురువారం మండలపరిషత్ కార్యాలయ భవనంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ దస్తగిరిబాషా, సులోచన మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పంచాయతీ ఆదాయ వనరులు పెరిగేలా బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే గ్రామ పంచాయతీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని కోవెలకుంట్ల ఎంపీడీవో వర ప్రసాదరావు. ఈవోపీఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు తెలిపారు. గురువారం పట్టణంలోని జిల్లాపరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జీపీడీపీపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారులచే నిర్వహించారు. పలు అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బనగానపలె: ఎంపీడీవో కార్యాలయంలో బనగానపల్లె మండల స్థాయి సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో, రమణ, ఎంపీపీ మానసవీణ, ఏపీఎం శ్రీనివాసులు, ఈవో బాలాంజనేయులు, సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొని సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా రాష్ట్రీయ గ్రామ్‌స్వరాజ్ అభియాన్ కింద గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలనే విషయాలపై క్షుణ్ణంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్, సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం'



ముస్తాక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని నంద్యాల మైనార్టీసెల్ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి తెలిపారు. గురువారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ కార్యదర్శిగా ఎంపికైన ముస్తాక్ అహ్మద్‌ను గురువారం శాలువ, పూలమాలలతో సన్మానించి అభినందించారు. మైనార్టీల చైర్మన్‌గా ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌలాలి, అనిఫ్, షమిద్దిన్, మాబుషరీఫ్, బారిక్‌చామల్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

బనగానపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ సూచించారు. గురువారం బనగానపల్లె పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయాధికారి బషీర్‌అహమ్మద్ సమక్షంలో ప్రారభించారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్ఎం శ్రీరాములు, బీడీసీ ఆర్గనైజర్లు శ్రీనివాసులు, విజయభాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురవారం నుండి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారభించినట్లు గ్రంథాలయ అధికారి సంగీతలక్ష్మి తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరమ్మతో కలిసి సరస్వతీ దేవికి పూజ చేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ నిర్వాహకుడు రంగయ్య ఉన్నారు.

చాగలమర్రి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండగారాలని గ్రంథాలయ అధికారి రామచంద్రుడు తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్స వాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

సంజామల: సంజామల గ్రంథాలయంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి గిద్దలూరు పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పుల్లయ్య, సురేంద్ర, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అవుకు: నేటి బాలలే రేపటి పౌరులని డోన్ డిప్యూటీ డీఈవో సుధాకర్‌రెడ్డి



కొలిమిగుండ్లలో నివాళి అర్పిస్తున్న దృశ్యం

అన్నారు. గురువారం మండలంలోని సుంకేసుల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం కార్యక్రమానికి హాజరై జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెచ్ఎం శివలక్ష్మి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, బషీర్, శోభారాణి, పద్మావతి, రామకృష్ణ, రవికుమార్, అజాంబేగ్, యాసిన్, ధర్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కొలిమిగుండ్ల గ్రంథాలయ అధికారి రాజమనోర్ పేర్కొన్నారు. గురువారం గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించారు.

- కొలిమిగుండ్ల మోడల్‌స్కూల్ నందు గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకొని అల్ట్రాటెక్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

అక్షరాస్యతే 'ఉల్లాస్' లక్ష్యం

- వయోజన విద్య నోడల్ అధికారి విజయ్‌భాస్కర్



మాట్లాడుతున్న అధికారి విజయభాస్కర్‌రెడ్డి

ఉయ్యాలవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పొదపు మహిళల్లో అక్షరాస్యత పెంచడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జిల్లా వయోజనవిద్య నోడల్ అధికారి విజయ్‌భాస్కర్ తెలిపారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్‌లో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 నుండి 50 ఏళ్లలోపు మహిళల్లో 26,784 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారన్నారు. ప్రతి 10 మందికి ఒక లంటీర్‌ను ఏర్పాటు చేసి అక్షరాస్యతను పెంచుతామన్నారు. మండలానికి 50 మంది వలంటీర్లను నియమించి నవంబరు నుండి మార్చి 2025 వరకు వయోజనులకు అక్షరాలు నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమమహేశ్వరరావు, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి, వెలుగు ఏపీయం దాసన్న, సీసీ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు న్యాయం చేస్తాం'

చాగలమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు తగిన న్యాయం చేస్తామని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ తెలిపారు. గురువారం మండలంలోని మల్లేవేముల, చాగలమర్రి గ్రామాలలో 44వ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన భూములను పరిశీలించారు. మల్లేవేముల గ్రామానికి సమీపంలో ఉన్న విలువైన సాగు భూములను హైవే నిర్మాణం కోసం కోల్పోతున్నామని, తమకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం అందించాలని రైతులు పక్రుద్దీన్, నరసింహారెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి తదితర ఆర్డీవోను కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని రైతులకు ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, హైవే డీటీ మంజునాథ్, జేఈ సురేంద్రనాథ్‌రెడ్డి, వీఆర్వోలు ప్రసాద్, ఇమామ్‌బాషా, సర్వేయర్లు పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి'



శిరివెళ్లలో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

శిరివెళ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల్లోని మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతిని సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. శిరివెళ్లలోని ఐకేపీ కార్యాలయంలో ఈసీ మెంబర్స్, వీవోఏలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు తరచూ క్షేత్రస్థాయికి వెళ్లి సంఘాల్లోని మహిళల పొదుపు రణాలు, చెల్లింపులతో పాటు సంబంధిత రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పీడీ హెచ్చరించారు. అనంతరం ప్రాజెక్టులో అమలవుతున్న పలు కార్యక్రమాలపై సమీక్షించారు. ఐకేపీ ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీసీలు మహేశ్వరి, దేవానంద్, శేఖర్, అయ్యన్న, వెలుగు అరుణోదయ మండల ఐక్య సంఘం అధ్యక్షురాలు రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

బనగానపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని నందవరం జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుడు రామగోవిందయ్య సొంత డబ్బుతో విద్యార్థు లకు గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. హెచ్ఎం భీమయ్య, ఉపాధ్యాయుడు రామగోవిందయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలన్నారు.

'కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి'

బనగానపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన వారంతా కేన్సర్ పరీక్షలు చేయించుకోవా లని టంగుటూరు వైద్య అధికారి డాక్టర్ శివ శంకరుడు సూచించారు. గురువారం బనగానపల్లెలోని 5వ సచివాల యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, ఓబిసిటీ, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారందరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

శిరివెళ్ల: కేన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే రోగికి సరైన చికిత్స అందించవచ్చని శిరివెళ్ల పీహెచ్‌సీ వైద్యు రాలు దివ్య తెలిపారు. గ్రామంలోని తెలుగు పేటలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఆమె గురువారం పరిశీలించారు. పొగాకు ఉత్పత్తులు సేవించడం ద్వారా నోటి కేన్సర్ వస్తుందని తెలిపారు. కేన్సర్ మహమ్మారిని పారదోలేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచిం చారు. సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ సుభాషిణి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ (రూరల్): కేన్సర్‌కు ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా వ్యాధిని నివారించవచ్చని చిన్న మల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చెన్నకేశవులు అన్నారు. గురువారం మండలంలోని ఉడుములపాడు గ్రామంలో కేన్సర్ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అవుకు: మండలంలో ఆరోగ్య సర్వేను ప్రారంభించినట్లు ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వేను డాక్టర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధులు, కేన్సర్ వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారన్నారు. సర్వే సమయంలో బీపీ, మధుమేహం, రక్తశాతం, బరువుకు సంబంధించిన పరీక్షలను ఇంటి దగ్గరే నిర్వహిస్తారన్నారు. 18 సంవత్సరాలు దాటిన మహిళలకు రొమ్ము, గర్భాశయ కాన్సర్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. డాక్టర్లు యమున, నవీన్, పీహెచ్ఎన్ మల్లేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్లు వేణుగోపాల్‌రాజు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని ఆలమూరు, నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అందరికీ కేన్సర్‌వైద్యపరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారులు బాబు, అమరనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం నరసాపురం, ఆలమూరు గ్రామాల్లో వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు.

వరిలో పంట కోత ప్రయోగం

రుద్రవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని చిత్తరేణిపల్లెలో వరికోతలో పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు ఏవో నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. చిత్తరేణిపల్లె గ్రామానికి చెందిన భూలక్ష్మి అనే రైతు పొలంలో సర్వే నెం.1163-1సిలో 1.96 ఎకరాల్లో పంట సాగు చేశారు. 5 ఇంటు 5 మీటర్ల వ్యాసార్థంలో పంట కోత ప్రయోగం చేసినట్లు తెలిపారు. ఇందువల్ల 21.170 కేజీల దిగుబడి వచ్చిందన్నారు. ఏఈవో రాజు, వీఏఏ పవిత్ర పాల్గొన్నారు.